క్లుప్తంగా

నేడు జాబ్‌మేళా

పెందుర్తి: నైపుణ్యాభివృద్ధి సంస్థ, జిల్లా ఉపాధి కార్యాలయం, సీడాప్ సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలోని స్కిల్ హబ్‌లో గురువారం జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి శాఖ అధికారి సాయికృష్ణ, జిల్లా ఉపాధి కల్పనాధికారి సుబ్బిరెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చంద్రశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఫైజర్, హెటిరో ల్యాబ్, కేఎల్ గ్రూప్ తదితర ప్రముఖ కంపెనీల్లో ఉపాధి కోసం నిరుద్యోగులకు ఇంటర్వ్యూలు జరుగుతాయన్నారు. పదో తరగతి, ఇంటర్మీడియట్, డిగ్రీ బీఎస్సీ కెమెస్ట్రీ, ఐటీఐ ఫిట్టర్, డిప్లొమా ఇన్ ఫార్మసీ ఉత్తీర్ణత కలిగిన అభ్యర్థులు జాబ్‌మేళాకు ఒరిజినల్ ధ్రువపత్రాలతో హాజరు కావాలని కోరారు. ఉదయం 9 గంటలకు పెందుర్తి పాలిటెక్నిక్ కళాశాలకు చేరుకోవాలని, వివరాలకు 99487 68778 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

వినాయక లడ్డూ వేలం



వేలంలో దక్కించుకున్న లడ్డూతో శ్రీనివాసరావు

పరవాడ: స్థానిక బొంకులదిబ్బ యూత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వరసిద్ధి వినాయక ఉత్సవాల్లో భాగంగా మండపం వద్ద 135 కిలోల లడ్డూ వేలం పాట నిర్వహించారు. గాజువాకకు చెందిన బండారు శ్రీనివాసరావు రూ.20 వేలకు దీనిని దక్కించుకున్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సీఈసీ సభ్యుడు పైల శ్రీనివాసరావు, ఉప సర్పంచ్ బండారు రామారావు, నాయకులు పైల వెంకటరావు, పైల హరీష్, పైల అప్పలనాయుడు, సత్యవేణి, రెడ్డి శ్రీనివాసరావు, పైల పోతినాయుడు, పైల అప్పారావు, చుక్క రవికుమార్, పైడినాయుడు, గంగరాజు, చీపురుపల్లి శ్రీనివాసరావు, యూత్ సభ్యులు పాల్గొన్నారు.

మహిళలకు ఉచిత శిక్షణ.. దరఖాస్తుల ఆహ్వానం

ఆరిలోవ: జిల్లా మహిళా కేంద్రంలో నిరుద్యోగ మహిళలకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నారు. ఆసక్తి గల వారు దరఖాస్తులు చేసుకోవాలని మహిళా ప్రాంగణం జిల్లా మేనేజర్ పి.విమల బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పైనాపిల్ కాలనీలోని జిల్లా మహిళా కేంద్రంలో ఈ శిక్షణ ఇస్తామని చెప్పారు. బేసిక్ సూయింగ్ మెషిన్ ఆపరేటర్, టైలరింగ్, మగ్గం వర్క్‌లో శిక్షణ కోసం ఎనిమిదో తరగతి చదివి ఉండాలన్నారు. బ్యూటీషియన్‌లో శిక్షణ కోసం పదో తరగతి ఉత్తీర్ణులై ఉండాలని తెలిపారు. ఆయా కోర్సుల్లో చేరదలచిన మహిళలు 18 ఏళ్ల నుంచి 40 ఏళ్ల మధ్య వయసు కలిగి ఉండాలన్నారు. ఆయా కోర్సులకు రెండు నెలలు పాటు శిక్షణ ఉంటుందని పేర్కొన్నారు. ఆసక్తి గల నిరుద్యోగ మహిళా యువతులు, గృహిణులు ఈ నెల 18లోగా దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. వివరాలకు 62812 61415 నంబర్‌లో సంప్రదించాలని విమల కోరారు.

అప్పన్న అన్నప్రసాద పథకానికి రూ.లక్ష విరాళం

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామి అన్నప్రసాద పథకానికి బుధవారం నగరంలోని లాసెన్స్‌బే కాలనీకి చెందిన వై.పరదేశి అనే దాత రూ.1,01,116 విరాళాన్ని అందజేశారు. సంబంధిత విరాళాన్ని చెక్కు రూపంలో ఆలయ ఏఈవో పాలూరి నరసింగరావుకి అందించారు. దేవస్థానం తరఫున దాతకు స్వామివారి దర్శనం కల్పించి శేషవస్త్రం, ప్రసాదం అందజేశారు.

రాష్ట్ర స్థాయి టెన్నికాయిట్ పోటీలకు గురుకుల విద్యార్థి



అవినాష్‌ను అభినందిస్తున్న గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ రామకృష్ణ తదితరులు

సబ్బవరం: స్థానిక డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ గురుకుల పాఠశాల టెన్త్ విద్యార్థి యు.అవినాష్ జిల్లా స్థాయి సబ్ జూనియర్ టెన్నికాయిట్ పోటీల్లో సత్తా చాటి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా బుధవారం అవినాష్‌ను పాఠశాల ప్రిన్సిపాల్ ఎస్.రామకృష్ణ అభినందించారు. ఆయన మాట్లాడుతూ ఈ నెల 10న లంకెలపాలెంలో జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో అవినాష్ ఈ ఘనత సాధించాడన్నారు. ఈ నెల 14 నుంచి 16 వరకు శ్రీకాకుళంలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటాడని తెలిపారు. అవినాష్‌కు ప్రిన్సిపాల్‌తోపాటు పీడీ సి.ఎల్.ఎస్.ప్రసాద్, పీఈటీ వి.సూర్యనారాయణ తదితరులు అభినందనలు తెలిపారు.

మురుగుమయం.. ముంపు భయం

- సబ్బవరం మండల కేంద్రాన్ని వేధిస్తున్న డ్రైనేజీ సమస్య
- వర్షం పడితే రోడ్లపైనే మురుగు నీరు
- పూడికతో పేరుకుపోయిన కాలువలు
- శాశ్వత పరిష్కారం చూపాలని స్థానికుల విజ్ఞప్తి



సబ్బవరం మూడు రోడ్ల కూడలిలో మురుగుతో కలిసి నిలిచిపోయిన వర్షపు నీరు



మూడు రోడ్ల జంక్షన్ సమీపంలో పూడికతో నిండిన కాలువ



వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో నిర్మించిన డ్రెయిన్

సబ్బవరం: మండల కేంద్రంలో డ్రైనేజీ సమస్య స్థానిక ప్రజలను తీవ్రంగా వేధిస్తోంది. సబ్బవరంలోని ప్రధాన రహదారికి ఇరువైపులా డ్రెయిన్లు లేకపోవడంతో చిన్నపాటి వర్షానికే మురుగు నీరంతా రోడ్డుపైకి చేరుతోంది. అక్కడ ఉన్న కాలువలు కాస్తా పూర్తిగా పూడికతో నిండిపోయాయి. వర్షం నీరు, మురుగు నీటితో కలిసి లోతట్టు ప్రాంతాలన్నీ ముంచెత్తుతున్నాయి. ఆయా ప్రాంతాల్లో మురుగు చేరి ప్రధాన కూడళ్లు, పరిసరాలు కలుషితమవుతున్నాయి. మెయిన్, బీటీ రోడ్లపై నిత్యం మురుగు నీరు ప్రవహిస్తుండటంతో రహదారులు దెబ్బతింటున్నాయి. మురుగు సమస్యతో వాహన చోదకులు, పాదచారులు.. ముంపు భయంతో లోతట్టు ప్రాంతాల వాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

మురుగుతో పరిసరాలు కలుషితం

సబ్బవరంలోని ఆనందపురం–అనకాపల్లి ప్రధాన రహదారిలో జోడుగుళ్ల నుంచి సాయినగర్ కాలనీ వరకు రోడ్డుకు ఇరువైపులా డ్రెయిన్లు లేకపోవడం సమస్యగా మారింది. సాయినగర్ నుంచి వచ్చే మురుగు నీరు సబ్బవరం మూడు రోడ్ల కూడలి మీదుగా సుమారు కిలో మీటర్ మేర పోలీస్ స్టేషన్ వరకూ ప్రవహిస్తోంది. దీంతో చిన్నపాటి వర్షం పడినా.. మూడు రోడ్ల జంక్షన్‌తోపాటు పోలీస్ స్టేషన్ ప్రాంతం ముంపునకు గురవుతోంది. ఆయా ప్రాంతాలు మురుగు నీటితో కలుషితమవుతున్నాయి. రోడ్లపై నీరు ప్రవహిస్తుండటంతో వాహన చోదకులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రూ.30 లక్షలతో పనులు

గతంలో ఆనందపురం–అనకాపల్లి జాతీయ రహదారి విస్తరణ ఉంటుందనే కారణంతో రోడ్డుకు ఇరువైపులా డ్రెయిన్ల నిర్మాణం నిలిచిపోయింది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో జాతీయ రహదారి సబ్బవరం పక్క నుంచి బైపాస్‌గా విస్తరించడంతో సబ్బవరం నుంచి రోడ్డు విస్తరణ భయం తొలగిపోయింది. సుమారు రూ.30 లక్షల నిధులతో సాయినగర్ కాలనీ నుంచి పోలీస్ స్టేషన్ వరకు గత ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ దశల వారీగా డ్రెయిన్ల ఏర్పాటుకు నిధులు విడుదల చేసి పనులు చేపట్టారు. సుమారు రూ.13 లక్షల వరకు నిధులు వెచ్చించి కొంత వరకూ డ్రెయిన్లు నిర్మించారు. పనులు చురుగ్గా సాగుతున్న సమయంలో కోవిడ్ రావడంతో అవి అర్ధాంతరంగా నిలిచిపోయాయి.

శాశ్వత పరిష్కారం అవసరం

పూర్తి స్థాయిలో కాలువల నిర్మాణం జరగకపోవడంతో మురుగు నీరు తరుచూ లోతట్టు ప్రాంతాలు, ప్రధాన కూడళ్లలో నిలిచిపోతోంది. దీంతో అంటు వ్యాధుల బారిన పడే అవకాశముందని స్థానికులు భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. అనేక సార్లు ఫిర్యాదులు చేసినా అధికారులు తాత్కాలికంగా అక్కడక్కడా పూడికలు తీసి సరిపెడుతున్నారే తప్పా.. సమస్యను పరిష్కరించడం లేదని స్థానికులు వాపోతున్నారు. స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికారులు దృష్టి సారించి డ్రైనేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

రోడ్లన్నీ జలమయం



సబ్బవరంలో రోడ్లకు ఇరువైపులా డ్రెయిన్లు లేకపోవడంతో చిన్నపాటి వర్షానికే జలమయమవుతున్నాయి. పోలీస్ స్టేషన్ ప్రాంతం పరిసరాలన్నీ జల దిగ్బంధంలో చిక్కుకుంటున్నాయి. వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోంది. పరిసరాలు కలుషితమై అంటువ్యాధులు సోకే ప్రమాదముంది.

– సింగంపల్లి వెంకటరావు, జోడుగుళ్ల, సబ్బవరం పంచాయతీ

సమస్య పరిష్కరించాలి



సబ్బవరం మూడు రోడ్ల కూడలిలో డ్రైనేజీ సమస్య ఉంది. ఇక్కడ వర్షం నీరు మురుగు నీటితో కలిసి రోడ్లపై నిలిచిపోతోంది. రోడ్డు సమీపంలో తోపుడు బండిపై పండ్ల వ్యాపారం చేసుకుంటున్నాను. కూడలిలో మురుగు నీరు చేరి ఈ ప్రాంతమంతా దుర్గంధంతో నిండిపోతోంది. అధికారులు, ప్రజాప్రతినిధులు శాశ్వత పరిష్కారం చూపాలి.

– ఎం.గౌరేష్, సాయినగర్ కాలనీ

శాశ్వత పరిష్కారానికి చర్యలు



సబ్బవరంలో డ్రైనేజీ సమస్య శాశ్వత పరిష్కారానికి చర్యలు చేపడుతున్నాం. ప్రధాన రహదారికి ఇరువైపులా డ్రెయిన్లు నిర్మించేందుకు రూ.2.5 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నాం. వర్షా కాలం కావడంతో రోడ్లపై మురుగు నీరు నిలిచిపోకుండా చర్యలు తీసుకుంటున్నాం. తాత్కాలిక పరిష్కారం కోసం ఆర్‌డబ్ల్యూఎస్ డిపార్ట్‌మెంట్ డ్రెయిన్లలో పూడికతీత చేపడుతోంది.

– బి.రమేష్‌నాయుడు, ఎంపీడీవో, సబ్బవరం మండలం

ప్రత్యామ్నాయ భూములు పరిశీలించిన కమిటీ



భూములు పరిశీలిస్తున్న సింహాచలం దేవస్థానం ఈవో, రెవెన్యూ ఆర్‌జేసీ తదితరులు

సింహాచలం: సింహగిరి శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామి దేవస్థానంతో ముడిపడి ఉన్న పంచగ్రామాల భూసమస్య పరిష్కారం కోసం దేవస్థానానికి ప్రభుత్వం ప్రత్యామ్నాయంగా ఇచ్చే భూముల విషయంపై ప్రభుత్వం ఏర్పాటు చేసిన కమిటీ బుధవారం పరిశీలించింది. సింహాచలం దేవస్థానానికి ప్రభుత్వం సుమారు 420 ఎకరాల ప్రత్యామ్నాయ భూమిని ఇచ్చేందుకు అంగీకరించిన విషయం తెలిసిందే. గాజువాక దరి ములగాడ మండలం, ఆనందపురం మండలం తదితర ప్రాంతాల్లో భూములను ఇప్పటికే చూశారు. సమస్య కోర్టులో కూడా ఉండటంతో ప్రత్యామ్నాయ భూముల విషయం ఇంకా తేలలేదు. ఈ తరుణంలోనే కొత్తగా ఏర్పడిన ప్రభుత్వం కమిటీ వేసింది. ఆయా భూములు అనువైనవో కాదో పరిశీలించాలని కమిటీని ఆదేశించారు. దీంతో సింహాచలం దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి, రెవెన్యూ ఆర్‌జేసీ సుబ్బారావు తదితరులు ఆయా భూమలను పరిశీలించారు. దీనిపై కలెక్టర్‌కు నివేదిక ఇవ్వనున్నారు.

రోడ్డు ప్రమాదంలో భార్యాభర్తలకు గాయాలు

కొత్తవలస: మండలంలోని అరకు–విశాఖ జాతీయ రహదారిలో నిమ్మలపాలెం జంక్షన్ సమీపంలో బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో భార్యాభర్తలు తీవ్ర గాయాలపాలయ్యారు. ఈ ప్రమాదానికి సంబంధించి స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. విశాఖపట్నానికి చెందిన భార్యాభర్తలు ద్విచక్రవాహనంపై ఎస్.కోట నుంచి విశాఖ వెళ్తుండగా ఎదురుగా వస్తున్న కారు ఢీకొట్టింది. దీంతో భార్యాభర్తలు తుళ్లిపోయి పక్కనే ఉన్న గోతిలో పడిపోయారు. ఈ ప్రమాదాన్ని గమనించిన స్థానికులు వెంటనే వారికి సపర్యలు చేశారు. కాగా మహిళా ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉండడంతో అపస్మారక స్థితికి చేరుకుంది. భార్యాభర్తలను వైద్యం నిమిత్తం విశాఖపట్నం తరలించారు. ఈ ఘటనపై ఎటువంటి ఫిర్యాదు అందలేదని సీఐ షణ్ముఖరావు తెలిపారు.

గణనాథుడికి పూజలు.. అన్నసమారాధనలు



చీమలాపల్లిలో అన్నప్రసాదం వడ్డిస్తున్న కార్పొరేటర్ ముమ్మన దేముడు



సిద్ధివినాయకుడిని దర్శించుకుంటున్న మాజీ ఎంపీపీ మాసవరపు అప్పలనాయుడు



గొల్లపేటలో విజేతలకు బహుమతులు అందజేస్తున్న అప్పలనాయుడు తదితరులు



సుజాతనగర్‌లో గణపతిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు

పెందుర్తి: జీవీఎంసీ 95వ వార్డు చీమలాపల్లిలో వినాయ కచవితి ఉత్సవాల్లో భాగంగా బుధవారం అన్నసమారాధన నిర్వహించారు. కార్పొరేటర్ ముమ్మన దేముడు చేతుల మీదుగా కార్యక్రమం ప్రారంభించగా.. 1000 మంది ప్రజలు అన్నప్రసాదం స్వీకరించారు. ముందుగా గణపతికి ప్రత్యేక పూజలు చేశారు. కమిటీ ప్రతినిధులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

వినాయక ఆలయంలో ఎమ్మెల్యే పూజలు

సుజాతనగర్ ఆంజనేయనగర్‌లోని సిద్ధి బుద్ధి సమేత వరసిద్ధి వినాయక ఆలయంలో కొలువుదీరిన గణపతికి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు పూజలు చేశారు. ఆలయ ధర్మకర్త బి.ఎస్ సూర్యప్రకాషరావు, స్థానిక నాయకులు, కాలనీ ప్రతినిధులు పాల్గొన్నారు.

పరవాడ: వాడచీపురుపల్లి శివారు కూండ్రపువారిదొడ్డిలో వినాయక ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. అక్కడ ప్రతిష్ఠించిన గణనాథుడిని బుధవారం మాజీ ఎంపీపీ మాసవరపు అప్పలనాయుడు దర్శించుకుని పూజలు చేశారు. మండపం వద్ద మధ్యాహ్నం ఏర్పాటు చేసిన అన్నసమారాధనను అప్పలనాయుడు ప్రారంభించారు. స్థానిక భక్తులు గణనాథుడిని దర్శించుకుని అన్నప్రసాదం స్వీకరించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ కూండ్రపు శ్రీనివాస్, కూండ్రపు అప్పారావు, సిద్ధివినాయక కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

- వాడచీపురుపల్లి శివారు గొల్లపేటలో కొలువైన సిద్ధివినాయకుడిని బుధవారం మాజీ ఎంపీపీ అప్పలనాయుడు దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. వినాయక చవితి వేడుకల్లో భాగంగా ఏర్పాటు చేసిన ఆటల పోటీల్లో విజేతలకు ఆయన బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు వియ్యపు చిన్న, ఉప సర్పంచ్ కె.శ్రీను, వియ్యపు ముత్యాలు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి



సమస్యలపై ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు

పెందుర్తి: నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో నిలిపేందుకు క్షేత్రస్థాయిలో సమస్యలపై దృష్టి సారిస్తున్నామని ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు తెలిపారు. సుజాతనగర్‌లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో బుధవారం ప్రజాదర్బార్ నిర్వహించారు. ప్రజల నుంచి నేరుగా ఆయన వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ త్వరితగతిన ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ఏ సమస్య ఉన్నా ప్రజలు నేరుగా తనకు చెప్పవచ్చన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

- పెందుర్తి ప్రభుత్వ పాలిటెక్నిక్ చుట్టూ తుప్పలు పెరిగిపోవడంతో విష కీటకాలు వస్తున్నాయని, పరిసరాల్లో కుక్కలు, పందుల బెడద ఎక్కువ ఉందని ప్రిన్సిపాల్ ఎన్.చంద్రశేఖర్ ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు.
- 77వ వార్డు పరిధిలో ముస్లిలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాల్సిందిగా కార్పొరేటర్ బట్టు సూర్యకుమారి ఆధ్వర్యంలో ముస్లిం పెద్దలు ఎమ్మెల్యేకు విన్నవించారు. పెందుర్తి, పరవాడ, సబ్బవరం ప్రాంతాల నుంచి పలు సమస్యలపై ఎమ్మెల్యేకు ప్రజలు వినతిపత్రం సమర్పించారు. వాటి నివారణకు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు పంచకర్ల సూచించారు.

దుర్గానగర్ కాలనీ సమస్యలపై వినతి

సబ్బవరం: సబ్బవరంలోని శ్రీగణేష్ దుర్గానగర్ కాలనీ వాసులు పలు సమస్యలను ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు దృష్టికి తీసుకెళ్లారు. బంతికోళ్ల పద్మ ఆధ్వర్యంలో కాలనీ వాసులు బుధవారం సుజాతనగర్‌లోని పార్టీ కార్యాలయంలో ఆయనకు వినతిపత్రం అందజేశారు. కాలనీ ముఖద్వారం వద్ద ఉన్న ప్రభుత్వ వైన్ షాపును అక్కడ నుంచి తొలిగించాలని, కాలనీలో 10 కేవీ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ సామర్థ్యం పెంచాలని కోరారు. బేతిన శ్రీనివాసరావు, గోర్లి కనకం, గోర్లి గోవింద్, ఒసుం రమణ, సబ్బవరపు సందీప్, అర్జునరావు, పురుషోత్తం, దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఫార్మా ఉద్యోగి అదృశ్యం



ఆర్.సూర్యనారాయణ

పరవాడ: జవహర్‌లాల్ నెహ్రూ ఫార్మాసిటీలో ఎడ్మిరాన్ లైఫ్ సైన్సెస్ ఫార్మా పరిశ్రమలో మంగళవారం ఉదయం విధులకు వెళ్లిన రంది సూర్యనారాయణ అదృశ్యమైనట్లు అతని కుటుంబ సభ్యులు పరవాడ పోలీసులకు బుధవారం ఫిర్యాదు చేశారు. వివరాలిలా.. ఎడ్మిరాన్ లైఫ్ సైన్సెస్ ఫార్మా పరిశ్రమలో ప్రొడక్షన్ మేనేజర్‌గా పనిచేస్తున్న ఆర్.సూర్యనారయణ మంగళవారం ఉదయం జనరల్ డ్యూటీలో భాగంగా పరిశ్రమ లోపలికి వెళ్లి సాయంత్రం తిరిగి ఇంటికి చేరుకోలేదు. బయోమెట్రిక్‌లో వేలిముద్ర వేసి పరిశ్రమ లోపలికి అతడు వెళ్లినట్లు నమోదైంది. సాయంత్రం విధులు ముగించుకుని తిరిగి ఇంటికి వెళ్లే ముందు బయోమెట్రిక్ హాజరు పట్టికలో బయటకు వెళ్లినట్లు నమోదు కాలేదు. ప్రతి రోజు ఉదయం 8 గంటలకు ఇంటి నుంచి విధులకు వెళ్లి సాయంత్రం 6.30 గంటలకు ఇంటికి చేరుకునే తన భర్త మంగళవారం రాత్రి 8 గంటలైన రాకపోవడంతో ఆందోళన చెందిన సూర్యనారాయణ భార్య బాల పరమేశ్వరి కంపెనీ యాజమాన్యాన్ని సంప్రదించింది. సూర్యనారాయణ ఉపయోగించే ద్విచక్ర వాహనం పరిశ్రమ బయటే ఉంది. అతడి ఆచూకీపై యాజమాన్యం నుంచి కూడా సరైన సమాధానం రాకపోవడంతో పరవాడ పోలీసులను ఆశ్రయించి బుధవారం కంపెనీ ఎదుట ఆమె ఆందోళనకు దిగింది. తన భర్త అదృశ్యంపై పలు అనుమానాలున్నాయని, దీనికి కంపెనీ యాజమాన్యమే బాధ్యత వహించాలని బాలపరమేశ్వరి డిమాండ్ చేసింది. ఇదిలా ఉండగా.. సూర్యనారాయణ అదృశ్యంపై యాజమాన్యం కూడా పోలీసులను ఆశ్రయించింది. దీనిపై పరవాడ సీఐ ఆర్.మల్లికార్జునరావు మాట్లాడుతూ ఇరువర్గాల నుంచి ఫిర్యాదులు స్వీకరించామని, సూర్యనారాయణ అదృశ్యంపై అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నామని చెప్పారు.

మహిళ మెడలో పుస్తెలతాడు అపహరణ

పెందుర్తి: బైక్ మీద ఇంటి వాకిలికి వచ్చి.. తాగడానికి నీరు అడిగి.. అదను చూసి ఓ మహిళ మెడలో పుస్తెలతాడు తెంచుకుపోయాడో దుండగుడు. పెందుర్తి మండలం దువ్వపాలెంలో జరిగిన ఈ ఘటన వివరాలిలా.. ఆనందపురం మండలం దబ్బందలో నివసిస్తున్న టి.రమణమ్మ బుధవారం ఉదయం దువ్వపాలెంలోని అమ్మగారి ఇంటికి వచ్చింది. రోడ్డు పక్కన ఉన్న ఇంటి వాకిలిలో ఆమె కూర్చుని ఉండగా బైక్‌పై హెల్మెట్ వేసుకుని వచ్చిన ఓ దుండగుడు తాగడానికి నీరు ఇవ్వమని రమణమ్మకు అడిగాడు. ఆమె ఇంట్లో నుంచి నీరు తెచ్చి ఇస్తున్న క్రమంలో మెడలోని మూడున్నర తులాల బంగారు పుస్తెలతాడు తెంచుకుపోయాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పెందుర్తి పోలీసులు క్రైం విభాగం సీఐ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో దర్యాప్తు చేస్తున్నారు.

ఏఎంసీకి అప్పారావు భౌతిక కాయం

- ఎల్‌వీ ప్రసాద్ కంటి ఆస్పత్రికి నేత్రాలు దానం



మరదాన అప్పారావు (ఫైల్)



అప్పారావు భౌతిక కాయాన్ని ఏఎంసీకి అందజేస్తున్న కుటుంబ సభ్యులు

మహారాణిపేట: తాను లేకున్నా తన శరీరం, కళ్లు ఇతరులకు ఉపయోగపడాలన్న ఆ పెద్దాయన సంకల్పాన్ని కుటుంబ సభ్యులు గౌరవించారు. ఆయన కోరిక మేరకు కళ్లను ఎల్.వి.ప్రసాద్ కంటి ఆస్పత్రికి, భౌతిక కాయాన్ని ఆంధ్ర మెడికల్ కళాశాలకు దానం చేశారు. వివరాలివి.. పురుషోత్తపురంలోని కంఫర్ట్ హోమ్స్‌లో నివాసం ఉంటున్న మరడాన అప్పారావు (89) సేవా భావంతో ఉండేవారు. 2019లో సావిత్రిబాయి పూలే చారిటబుల్ ట్రస్ట్ ద్వారా శరీర దానానికి అంగీకార పత్రం అందజేశారు. ఆయన కుమారుడు ఎన్ఎస్‌టీఎల్ ఉద్యోగి అయిన చంద్రశేఖర్‌తో పాటు, కోడలు, ముగ్గురు కుమార్తెలు కూడా శరీర, అవయవ దానాలు చేసేలా ప్రోత్సహించారు. స్నేహితులను, చుట్టుపక్కల వారికి కూడా దేహదానం, అవయవదానంపై అవగాహన కల్పించేవారు. అనారోగ్య కారణాలతో అప్పారావు మంగళవారం తుదిశ్వాస విడవడంతో ట్రస్ట్ సహకారంతో ఆయన కుటుంబ సభ్యులు శరీర, నేత్రదానం చేశారు. శరీరదాత అప్పారావుకు సావిత్రిబాయి పూలే ట్రస్ట్ చైర్‌పర్సన్ సీతామహాలక్ష్మి ప్రకటనలో జోహార్లర్పించారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం రేపు

సబ్బవరం: మండలంలోని సబ్బవరం సెక్షన్–1 పరిధి 33/11 కేవీ సబ్బవరం సబ్ స్టేషన్ మెయింటెనెన్స్ పనుల్లో భాగంగా ఈ నెల 13న విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుందని ఈఈ ఎస్.రామకృష్ణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ సబ్బవరం పంచాయతీతోపాటు తవ్వవానిపాలెం, అమృతపురం, గొల్లలపాలెం, పైడివాడ, ఆసకపల్లి, ఇరువాడ, పల్లవానిపాలెం గ్రామాల్లో విద్యుత్ సరఫరా ఉండదని, ప్రజలు గమనించాలని ఆయన కోరారు.

వర్గీకరణ తీర్పును పునః సమీక్షించాలి



తహసీల్దార్ శ్రీవల్లికి వినతిపత్రం అందిస్తున్న పోరాట కమిటీ నాయకులు

అగనంపూడి: ఎస్సీ వర్గీకరణ విషయంలో సుప్రీంకోర్టు తీర్పు న్యాయబద్ధంగా లేదని, ఈ విషయంలో పునరాలోచించాలని కోరుతూ మాలమహానాడు ఆధ్వర్యంలో కూర్మన్నపాలెం కూడలి వద్ద రాస్తారోకో నిర్వహించారు. ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి నాయకులు మాట్లాడుతూ తీర్పు సహేతుకంగా లేదని, ఈవిషయంలో సుప్రీం కోర్టు ధర్మాసనం పునః సమీక్షించాలని నాయకులు కెబీఆర్ అంబేద్కర్, మాటూరి శ్రీనివాసరావు, పాల్తేటి పెంటారావు కోరారు. అనంతరం గాజువాక తహసీల్దార్ శ్రీవల్లికి వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో బలిరెడ్డి నాగేశ్వరరావు, గాలి ఆనంద్, డాక్టర్ ప్రకాష్ రత్నం, పట్నాలరాజు, బీపేస్వామి, సమ్మంగి కొండలరావు, నరవ రమణ, ఆదిత్య తదితరులు పాల్గొన్నారు.

మహిళా కళాశాలలో ఎన్‌సీసీ ఎన్‌రోల్‌మెంట్

డాబాగార్డెన్స్: విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో బుధవారం ఎన్‌సీసీ బెటాలియన్ నేతృత్వంలో బాలికల కోసం ప్రత్యేకంగా ఎన్‌రోల్‌మెంట్ నిర్వహించారు. సుబేదార్ మేజర్ బోడ్డే, సుబేదార్ అమిత్‌సింగ్, నాయక్ హస్సేనయ్యా, పల్లవి కొత్త క్యాడెట్ల నమోదు చేపట్టారు. ఎంపికలో భాగంగా క్యాడెట్లకు 500 మీటర్ల పరుగు, దృష్టి పరీక్ష, అవయవాల కదలిక పరీక్ష, బాడీ మాస్ ఇండెక్స్ మూల్యాంకనం, రాత పరీక్ష, వ్యక్తిగత ఇంటర్వ్యూల ఆధారంగా ఎంపిక చేశారు. కళాశాల నుంచి 103 మంది విద్యార్థినులు పాల్గొనగా.. వీరిలో 22 మంది ఎంపికయ్యారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.మంజుల, ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ ఆర్.కిరణ్మయి, ఎన్‌సీసీ అధికారి లెఫ్టినెంట్ డాక్టర్ కె.గీతాంజలి తదితరులు పాల్గొన్నారు.